www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 20 మే 2023



హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్, హేలాపురి బాలోత్సవం ఆధ్వర్యాన
20, 21, 22 తేదీల్లో వేసవి వినోదం

ఏలూరు:వేసవి సెలవుల్లో హైస్కూల్ విద్యార్థులకు వినోదం, విజ్ఞానం కోసం హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్, హేలాపురి బాలోత్సవం ఆధ్వర్యంలో శిక్షణ, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ఆలపాటి నాగేశ్వరరావు, జి.శారద, ఎస్.గంగాభవాని, గుడిపాటి నరసింహారావు, పి.హైమావతి, పి.కిషోర్ తెలిపారు. ఈనెల 20వ తేదీన గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్లో, 21, 22 తేదీల్లో ఈదర సుబ్బమ్మ దేవి హై స్కూల్లో జరుగుతున్న ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు సులభ గణితం, తెలుగు భాష, డ్రాయింగ్, సెల్ఫ్ డిఫెన్స్ డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్, పాటలలో విద్యార్థులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. తొమ్మిదో తేదీ నుండి ఏలూరులోని నాగేంద్ర కాలనీ, వెన్నవల్లివారిపేట, బాలల శాఖ గ్రంథాలయం, అన్నే భవనం, భగత్ సింగ్‌నగర్, ఎఈడిపిటి హై స్కూల్, ట్రైబల్ నగర్, పోణంగి వైఎస్ఆర్ కాలనీల్లో ఈ క్యాంపులు నిర్వహించామన్నారు. ఒక్కో క్యాంపునకు 20 నుండి 50 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు.

కూలి తెలీదు.. కారణం చెప్పరు..!

ఉపాధి కూలీల పట్ల ప్రభుత్వ తీరు దారుణం
పే స్లిప్పులు ఇవ్వకుండా మోసపూరిత వైఖరి
బ్యాంకు ఖాతాలో ఎంత పడితే అంతే
జిల్లాలో కొనసాగుతున్న పరిస్థితిపై కూలీల్లో చర్చ
రెండు పూటలా పని విధానంతో వడదెబ్బకు కూలీలు విలవిల



జాతీయ రహదారి పక్కన దెందులూరు పంటకాలువలో పనిచేస్తున్న పాలగూడెం ఉపాధి కూలీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని స్పష్టమవుతోంది. ఉపాధి కూలీల పట్ల బిజెపి వ్యవహరిస్తున్న తీరే అందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. రెండు జిల్లాల్లో 5.50 లక్షల మందికిపైగా ఉపాధి హామీ జాబ్‌కార్డులున్నాయి. ప్రతీ కుటుంబానికి వందరోజుల పనిదినాలు కల్పించాలన్న నిబంధన ఉంది. వందరోజుల పనిదినాలు అనేవి అమలుకావడం లేదు. 2022-23లో రెండు జిల్లాల్లో సరాసరిన కుటుంబానికి కల్పించిన పనిదినాలు 50 రోజులు కూడా లేవు. పనిదినాలను సైతం కుదించేస్తున్న ప్రభుత్వం ఉపాధి కూలీల హక్కులను సైతం హరిస్తోంది. ఉపాధి పనిలో రెండు పూటలా పనివిధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. ఉదయం ఐదు గంటలకు పని ప్రదేశానికి చేరుకుంటున్న కూలీలు మధ్యాహ్నం 11.30 గంటల వరకూ ఉండాల్సి వస్తోంది. మొదటి ఫొటోకు, రెండో ఫొటోకు నాలుగు గంటల వ్యవధి ఉండాలన్న నిబంధనే అందుకు కారణం. ఇన్ని నిబంధనలు తెచ్చిన కేంద్ర ప్రభుత్వం కూలీలకు ప్రతిరోజూ ఎంతకూలి వస్తుందో చెప్పే పే స్లిప్పులు మాత్రం ఇవ్వడం లేదు. గతంలో వారానికి ఒకరోజు ఉపాధి కూలీలకు పే స్లిప్పులు ఇచ్చేవారు. ఏరోజు ఎంత కూలిపడిందో అందులో స్పష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు ఇవ్వడం లేదు. అదేమని అడిగితే కూలీల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేస్తున్నాం కదా ఇంకా పే స్లిప్పులు ఎందుకని మాట్లాడుతున్నారు.

ఏదైనా పనికి వెళితే ఎంత కూలిస్తారో ముందే చెబుతారు. దాన్నిబట్టి కూలీలతో పని చేయించుకుంటారు. ఉపాధి హామీ పనుల్లో మాత్రం పని చేయడమే తప్ప రోజుకు కూలి ఎంత వస్తుందో తెలియదు. గతంలో పే స్లిప్పుల ఆధారంగా ఏ రోజు ఎంతపడుతుందో వివరాలు ఇచ్చే ప్రభుత్వం వాటిని ఇవ్వకుండా నిలిపివేసింది. దీంతో ఉపాధి పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం నిర్దేశించిన కూలి వస్తుందో లేదో కూడా ఏ ఒక్కరికీ తెలియడం లేదు. అదేమని అడిగితే ఏ అధికారీ కారణం చెప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలను వేతన విషయంలోనూ మోసం చేస్తున్నారు.

రోజు కూలి ఎంత పడింతో తెలియాలా.. వద్దా

జిల్లాలో చాలా చోట్ల దాదాపు ఐదు వారాల నుంచి ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ రెండు వారాల కూలి సొమ్ములు మాత్రమే వారి ఖాతాల్లో జమయ్యాయి. ఏ రోజు ఎంత కూలి వచ్చిందో ఏ ఒక్కరికీ తెలియడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి కూలీలకు రోజుకు రూ.272 కూలి ఇవ్వాల్సి ఉంది. జిల్లాలో ఏ ఒక్క ఉపాధి కూలీకి ప్రభుత్వం చెప్పిన కూలి సొమ్ము అందడం లేదు. అనేక కారణాలు చెబుతూ కోతలు పెడుతున్నారు. బ్యాంకులో పడిన సొమ్ముల ప్రకారం సరాసరి లెక్కిస్తే రూ.200 నుంచి రూ.240 వరకూ వస్తున్నట్లు తెలుస్తోంది. కొన్నిసార్లు రూ.180 కూడా రావడం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన పని చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో కూలి ఎందుకు ఇవ్వడం లేదో చెప్పడం లేదు. ఏ రోజు ఎంత కూలి వచ్చిందో వివరాలు ఇవ్వడం లేదు. దీని వెనుక ఉన్న మతలబు ఏమిటో తెలియడం లేదు. పే స్లిప్పులు ఇవ్వాలని కూలీలు డిమాండ్ చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. మండుటెండలో అన్ని గంటలు పనిచేస్తున్నప్పటికీ పూర్తిస్థాయి కూలి పడకపోగా, వచ్చే కూలి ఎంతో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో ఉపాధి కూలీలు ఉండటం దారుణంగా చెప్పొచ్చు. పే స్లిప్పులు ఇస్తే రోజు కూలి లెక్కతెలిస్తే ఆ రోజు ఎందుకు తక్కువ కూలి పడిందో కూలీలు అధికారులను అడిగే అవకాశం ఉంటుంది. పే స్లిప్పులు ఇవ్వకపోవడంతో కూలీలు అడిగలేని పరిస్థితి ఏర్పడింది.

పే స్లిప్పులు ఇవ్వడం లేదు



తినార్తి శ్రీను, పాలగూడెం, ఉపాధి కూలీ

పే సిప్పులు ఇవ్వడం లేదు. ఇప్పటి వరకూ ఐదు వారాలు పనిచేశాం. రెండు వారాల డబ్బులు జమయ్యాయి. పే స్లిప్పులు ఇస్తే ఏ రోజు కూలి ఎంతో పడుతుందో తెలుస్తుంది. గతంలో ఇచ్చేవారు. ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదో తెలీడం లేదు.

ఇబ్బంది కరంగా రెండు పూటల పని విధానం



టి.వరలక్ష్మి, పాలగూడెం, ఉపాధి కూలీ

రెండు పూటలా పనివిధానంతో తెల్లవారుజామున వెళితే ఇంటికి వచ్చేసరికి 11 గంటలు దాటేస్తోంది. దీంతో ఎండ దెబ్బ తీవ్రంగా ఉంటుంది. మజ్జిగ ఇవ్వడం లేదు. పే స్లిప్పులు ఇస్తే కూలి వివరాలు తెలుస్తాయి. బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి. ఏ రోజు ఎంత కూలి పడిందో తెలీదు.



కల్లాల్లో ఉన్న ధాన్యం రాశులు, బస్తాలు

ధాన్యం కొనండి మహాప్రభో

యండపల్లి రైతుల ఆందోళన - ధాన్యం లోడు లారీ అడ్డగింత



అధికారులను నిలదీస్తున్న రైతులు

ప్రజాశక్తి - చింతలపూడి

'రోజుల తరబడి కల్లాల్లోనే ధాన్యం ఉండిపోయింది. కొనుగోలుకు అధికారులు ముందుకు రావడం లేదు. సంచులు ఇవ్వడం లేదు. దయచేసి ధాన్యం కొనుగోలు చేయండి మహాప్రభో.' అంటూ మండలంలోని యండపల్లి రైతులు అధికారులను, ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ మండలంలోని గ్రామ రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. గ్రామం మీదుగా వెళ్తున్న రాఘవాపురం ఆర్‌బికె ధాన్యంలోడు లారీని రైతులు అడ్డుకున్నారు. అందరిలా తమ ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదని నిలదీశారు. లారీకి అడ్డుగా నిలబడి ఆందోళన చేపట్టారు. 20 రోజుల నుండి తమ ధాన్యం కల్లాల్లోనే ఉందని, గోనె సంచులు ఇవ్వలేదని, లారీలు కూడా రావటం లేదని మండిపడ్డారు. యండపల్లి ఆర్‌బికె చుట్టూ తిరిగిన తమ ధాన్యాన్ని తరలించడానికి లారీలు గానీ, సంచులు గానీ పంపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇలా ఎందుకు చేస్తున్నారని రైతులు ప్రశ్నించారు. అధికారులు దళారులతో చేతులు కలిపి సొమ్ము చేసుకుంటున్నారని రైతులు అనుమానం వ్యక్తం చేశారు. ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని సిఎం జగన్ చెబుతున్న మాటలు ఆచరణలో కనిపించడం లేదన్నారు. చింతలపూడి మండలం యండపల్లి గ్రామానికి ఇప్పటికీ 19 వేల గోనె సంచులు ఇవ్వగా, ఇంకా పది వేల గోనె సంచుల కొరత ఉందని ఆర్‌బికె సిబ్బంది చెబుతున్నారన్నారు. యండపల్లి పంచాయతీ పరిధిలో 1580 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ఇప్పటికే టార్గెట్ 540 మెట్రిక్ టన్నులు పూర్తికావడంతో గోనె సంచులు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన ధాన్యం కొనుగోలు చేయాలని, గోనె సంచుల కొరత లేకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న అగ్రికల్చర్ ఎఒ మీనాకుమారి, సివిల్ సప్లయిస్ డిటి జానీ, సర్పంచి యడ్ల మోహన్ రైతులతో మాట్లాడి గోనె సంచుల కొరత లేకుండా చేస్తామని, మిగతా ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్‌డిఒ జాన్సీరాణి

నిర్వాసితులకు అన్ని వసతులు కల్పిస్తాం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పరిహారం, పునరావాసం విషయంలో నిర్వాసితులు ఆందోళన చెందొద్దని, వారికి అన్ని వసతులూ కల్పించనున్నట్లు ఆర్‌డిఒ ఎం.జాన్సీరాణి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని ఎర్రవరం నిర్వాసిత కాలనీని పరిశీలించారు. గ్రామాల్లో మౌలిక వసతుల గురించి ఇన్‌ఛార్జి తహశీల్దార్ సందీప్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. కాలనీవాసులకు భూమికి భూమి సంబంధించి కొంత సమస్య ఉందని వెంటనే దాన్ని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో ఉన్న సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. నిర్వాసిత కాలనీలో శ్మశాన వాటిక సమస్య ఉందని ఫిర్యాదు చేయగా ఎస్‌డిసి గీతాంజలి మాట్లాడుతూ శ్మశాన వాటికకు భూమిని కేటాయించినట్లు దానికి సంబంధించి నగదు ఇవ్వాల్సి ఉందని అది అయిన వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ మాధురి, విఆర్‌ఎ షరీఫ్ పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయ అధికారికి వినతిని అందిస్తున్న నాయకులు

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు కోరుతూ ధర్నా

కుక్కునూరు:అక్రమంగా ఆంధ్రా నుండి తెలంగాణకు ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు అన్నారు. ఇసుక అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ కుక్కునూరు మండలంలోని ఇబ్రహింపేటలో ఉన్న ఇసుక ర్యాంప్ నుండి అక్రమంగా రాత్రీపగలు తేడా లేకుండా లారీలలో తెలంగాణ ప్రాంతాలకు విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్నారని, మండల ప్రజలకు ఇసుక అందుబాటులో లేకపోవడం పనుల్లేక భవన నిర్మాణ కార్మికుల పని కోసం తెలంగాణకు వెళ్తున్నారని తెలిపారు. మండలంలో ఉన్న ఇసుక మాత్రం ఇక్కడ ప్రజలు వాడుకునే వీలులేకుండా పోయిందన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. నిత్యం పత్రికల్లో వార్తలు వస్తున్నప్పటికీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అసలు ఇసుక ర్యాంప్‌కు అనుమతులున్నాయా.. ఉంటే బహిరంగంగా చూపాలని లేదంటే ఇసుక ర్యాంప్ నడుపుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని ర్యాంప్ రద్దు చేసి గిరిజనులకు ర్యాంప్‌నకు అనుమతినిచ్చి మండల ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తేవాలని కోరారు. అనంతరం వినతిని తహశీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ నరసింహారావుకు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు యర్నం సాయికిరణ్, మేడిపల్లి బాబు, కోట మోహన్‌రావు, సాయి పాల్గొన్నారు

'పది'లో జిల్లా టాపర్‌కు ఎంఎల్‌ఎ అభినందన

ఏలూరు టౌన్:పదో తరగతి పరీక్షల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన పెదపాడు మండలం వట్లూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గాయత్రిని శుక్రవారం ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్య చౌదరి సత్కరించి అభినందించారు. పసుపులేటి గాయత్రి 590 మార్కులు సాధించి అద్భుత ప్రతిభను చాటింది. ఈ సందర్భంగా గాయత్రికి ఎంఎల్‌ఎ శుభాకాంక్షలు తెలిపారు. సిఎం జగన్ పేద విద్యార్థులకు చక్కటి అవకాశాలు కల్పిస్తూ అండగా నిలిచారన్నారు. టాప్ ర్యాంకులు, మంచి మార్కులు కేవలం కార్పొరేట్ పాఠశాలల వారికే సొంతం కాదని గాయత్రి రుజువు చేసిందన్నారు. గాయత్రి కోరుకున్నట్లు ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. తాను తోడుగా నిలుస్తానని ఎంఎల్‌ఎ ప్రకటించారు. గాయత్రి, తండ్రి రమేష్ చిన్నపాటి మేస్త్రి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

సుందరయ్య ఆశయాలు ఆదర్శం

జిల్లావ్యాప్తంగా 38వ వర్ధంతి సభలు

ప్రజాశక్తి - ఏలూరు

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సుందరయ్య వర్ధంతిని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి సోమయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కె.విజయలక్ష్మి, వి.సాయిబాబు, చింతాడ లక్ష్మి, జె.గోపి, విజెఎం.కృష్ణారావు, ఎం.సత్యం, బి.త్రినాథ్ పాల్గొన్నారు.

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంలో సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు విజిఎంవిఆర్.కృష్ణారావు, ఆలపాటి నాగేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గుడిపాటి నరసింహారావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో ఎం.లక్ష్మి, జి.శారద, జగదీష్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక తొమ్మిదో వార్డు అమ్మా చలివేంద్రం వద్ద సుందరయ్య వర్ధంతి సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. తొలుత పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి డివైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి షేక్ మాబు సుభాని, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ పూలమాల వేసి నివాళి అర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి మానుకొండ జీవరత్నం మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు పసల సూర్యారావు, షేక్ సుభాషిణి, వంగా గోపి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బి.యశ్వంత్, డివైఎఫ్‌ఐ నాయకులు ఎం.నాగార్జున, పి.ఏడుకొండలు, చిన్న, పి.యోగి పాల్గొన్నారు.

స్థానిక సిపిఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, పట్టణ నాయకులు పి.సూర్యారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ప్రభాకర్‌రావు, ఆర్.దుర్గారావు, పటాన్, మస్తాన్, పట్టణ కమిటీ సభ్యులు సుభాషిణి, వి.గోపి, మాబుసుభాని, సిహెచ్.మాణిక్యాలరావు, బి.యశ్వంత్, లెనిన్, ఎ.స్టాలిన్ పి.సత్తిబాబు, సునీల్ పాల్గొన్నారు.

నిడమర్రు : సుందరయ్య ఆశయాలు అందరికీ ఆదర్శమని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు అన్నారు. సుందరయ్య వర్ధంతి సభను నిడమర్రులోని ప్రజాసంఘాల కార్యాలయంలో కోన శ్రీను అధ్యక్షతన జరిగింది. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గవర సత్యనారాయణ, కంచం వరప్రసాద్, వెలగలేటి మోహన్, బోనాల ప్రసాద్, జాన్సీ, రంగారావు, సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

కుకునూరు : సుందరయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక సుందరయ్య ప్రజాసంఘాల భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేందర్రావు, మండల కమిటీ సభ్యులు ఎం.బాబు, వై.సాయికిరణ్, వలీ పాషా, కోటా మోహనరావు పాల్గొన్నారు.

చాట్రాయి : సుందరయ్య వర్ధంతిని సిపిఎం మండల కార్యదర్శి కొలికిపోగు భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని వెంకటరెడ్డి చెరువు వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్ద సభ నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు 200 మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు టిఎన్‌ఎం.సూరి, కొలికిపోగు మయూత పాల్గొన్నారు.



ఏలూరులో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం

చిన్నంపేటలో సామాజిక చైతన్య వేదిక మండల కన్వీనర్ ఇవి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కొమ్ము ఆనందం ఆధ్వర్యంలో చిన్నంపేట గిన్నెల చెరువు వద్ద ఉపాధి కూలీల సమక్షంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

కుక్కునూరు : సుందరయ్య వర్ధంతి సందర్భంగా సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఐదు పంచాయతీల్లో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేందర్రావు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకోసం తన జీవితాన్ని అంకితం చేసిన సుందరయ్య ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. అనంతరం సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని చీరవల్లి, మాధవరం, గొల్లగుప్ప, కొండపల్లి, మారేడుబాక, దాచారం, సీతారామపురం, ఉప్పరమద్దిగట్ల, బుడుగు, నెమలిపేట తదితర పది గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న వెయ్యి మంది కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోటా రామలక్ష్మి, ఎం.బాబు, వై.సాయికిరణ్, పట్ల లక్ష్మయ్య, మోహన్‌రావు, వలీపాషా, ఎస్.లక్ష్మణరావు, రాము, లక్ష్మీ పాల్గొన్నారు.



జీలుగుమిల్లిలో ముగ్గుల పోటీలు

వేలేరుపాడు:మండలంలోని గుంపెనగూడెంలో మడకం ఏసు అధ్యక్షతన సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సిపిఎం నాయకులు మడివి దుర్గారావు, కారం వెంకట్రావు, లక్ష్మణరావు, రాంబాబు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : సిపిఎం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతిని ఆగిరిపల్లి సుందరయ్య నిలయంలో నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సిహెచ్.శివ నాగరాజు, సత్తు కోటేశ్వరరావు, గంటా పాపారావు, మువ్వ రాజారావు, జహంగీర్ బాషా, జె.గోపాలరావు, ఎం.నరేష్, ఎన్.ఊళక్కయ్య, బి.కోటేశ్వరరావు, ఎం.సుభాకరరావు, స్టాలిన్, పరిశయ్య పాల్గొన్నారు.

కలిదిండి : సుందరయ్య వర్ధంతిని మండలంలోని మూలలంక, పోతుమర్రు గ్రామాల్లో సిపిఎం, ప్రజాసంఘాల అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళరావు, ప్రజాసంఘాల నాయకులు చిన్నం శ్రీకాంత్, ఎస్.మహాలక్ష్మి, లక్ష్మితిరుపతమ్మ, కార్యకర్తలు జమ్ము దుర్గ, యజ్జవరపు సావిత్రి, నామాన విష్ణు, బళ్ల మంగమ్మ, పతివాడలంక నాగమణి, కనకమ్మ, సత్యవతి, శిరోమణి పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : సుందరయ్య వర్ధంతిని మండలంలో ఉపాధి పని ప్రదేశాలు, ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తామ ముత్యాలమ్మ మాట్లాడుతూ సుందరయ్య జీవితం ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మొడియం నాగమణి, మండల నాయకులు



జంగారెడ్డిగూడెంలో..

పోలోజు నాగేశ్వరావు, తెల్లం వెంకటలక్ష్మి, కె.భాస్కర్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : నూజివీడు పదో వార్డులో సిపిఎం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్లు, నాయకులు దుర్గారావు, ప్రభాకర్, జిలాని, శ్రీనివాస్, రంగారావు, సిఐటియు నాయకులు కమల, ప్రసాద్, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : సుందరయ్య ఆశయాలు ఆదర్శమని సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు అన్నారు. పార్టీ నాయకులు ఆకుల దుర్గారావు అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, ముళ్లపూడి సురేష్, టెక్ మధు, దాసం వీర్రాజు, చెరుకూడి మరిడియా, పిల్లా తమ్మారావు, కడియం సీతారాముడు, ధనరాజు, చిలకంటి సత్యనారాయణ, దుర్గారావు, వెంకటేష్, సాయి. పి.రమేష్, త్రిమూర్తులు, సురేష్, గోపి పాల్గొన్నారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

జీలుగుమిల్లి : సుందరయ్య కాలనీలో కాలనీ కమిటీ అధ్వర్యంలో కాలనీ వార్షికోత్సవం, సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. వార్షికోత్సవ సభలో ముఖ్యఅతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం కుర్చీల పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు ప్రసాద్ ద్వారా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు నెలటూరి అప్పారావు, నిర్మల, సిరిబత్తుల సీతారామయ్య, కొండలరావు, దుర్గ, కాలనీవాసులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : సుందరయ్య వర్ధంతిని మండలంలోని అల్లూరి సీతారామరాజునగర్‌లో సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తుమ్మల సత్యనారాయణ, అనుమోలు మురళీ, మడకం కుమారి, బి.కుమారి, చెల్లమ్మ ఉన్నారు.

పోలవరం:సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఇటుకలకోటలో సిపిఎం నేత బొరగం భూచంద్రం అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకటరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పార్టీ మండల కమిటీ సభ్యులు మిడియం గంగాదేవి, టి.బాలరాజు, మిడిమి చలపతి, కొమరం పోసిరత్నం పాల్గొన్నారు.

సుందరయ్య వర్ధంతి సందర్భంగా మజ్జిగ చలివేంద్రం

ఏలూరు టౌన్ : సుందరయ్య వర్ధంతి సందర్భంగా సిపిఎం గాంధీనగర్ శాఖ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక పవర్‌పేటలోని సుందరయ్య గ్రంథాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శాఖ మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి సిపిఎం గాంధీనగర్ శాఖ కార్యదర్శి కంది విశ్వనాథం అధ్యక్షత వహించారు. సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి కోసం తుది శ్వాస వరకూ పోరాడిన నాయకుడు సుందరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శాఖ సభ్యులు జనగం గోపి, ఎం.ఇస్సాకు, మాఊరి శ్రీనివాసరావు, చింతాడ వెంకటలక్ష్మి, కంది అమరావతి, జి.శారద, గౌడు రవీంద్ర, అల్లం వెంకటేశ్వరరావు, సువ్వాడ సత్యనారాయణ, బావిశెట్టి సుందరయ్య, కంది వెంకటేశ్వరరావు, సింహాచలం, శేఖర్, హరిప్రియ పాల్గొన్నారు.

ముదినేపల్లి : సుందరయ్య వర్ధంతిని మండలంలోని దేవపూడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఉల్లంకి నాంచారయ్య, మట్లపూడి కనకరావు, ఆలపాటి కుటుంబరావు, చిన్నం మాధవ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుళాయి కనెక్షన్లకు సొమ్ము వసూలుపై విచారణ

ప్రజాశక్తి - కలిదిండి

కుళాయి కనెక్షన్ల మంజూరుకు స్థానిక పంచాయతీలో అదనపు సొమ్ము వసూలుపై బి.మహేంద్రవర్మ ఫిర్యాదు మేరకు విచారణ జరిగింది. ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్ ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు రెండు గంటల పాటు బహిరంగ విచారణ జరిగింది. 2010 – 2012 ఏడాది మధ్య కాలంలో సుమారు 823 కుళాయి కనెక్షన్ల మంజూరులో రూ.60 లక్షల అవినీతి, అక్రమాలు జరిగాయంటూ నాటి కార్యదర్శి వి.కుమారస్వామి, నాటి సర్పంచి నున్న రమాదేవిపై ఫిర్యాదు రాగా విషయం లోకాయుక్తకు వచ్చినట్లు తెలిపారు. కలెక్టర్ వి.ప్రసన్నవెంకటేష్ ఆదేశాల మేరకు హాజరైనట్లు చెప్పారు. కుళాయి కనెక్షన్‌కు రూ.5100 కట్టించుకోవాల్సి ఉండగా రూ.15 వేలు వసూలు చేశారనే విషయంలో నాటి (రిటైర్డ్) డివిపిఒ వి.గోపాలకృష్ణ, నాటి(రిటైర్డ్) కార్యదర్శి వి.కుమార్‌స్వామి, నాటి (మాజీ) సర్పంచి నున్న రమాదేవి నుంచి వివరాలను లిఖిత పూర్వకంగా నమోదు చేశారు. గ్రామ స్థాయిలో కూడా విచారణ జరిపి పూర్తి నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామని ఆర్‌డిఒ కిషోర్ తెలిపారు. తహశీల్దార్ తేజోమణి, ఇఒపిఆర్‌డి శ్రావణ్‌కుమార్, ఏఇ శ్రీనివాస్, ఆంజనేయులు, కార్యదర్శి ఆర్‌వి ఉదయ్‌కుమార్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లల బంగారు భవిష్యత్తుకు పాటుపడాలి


దంపతులను సత్కరిస్తున్న సర్పంచి, ఎంపిటిసి

ఆగిరిపల్లి: ఆడపిల్లల పట్ల సమాజంలో సమానత్వం, లింగవివక్ష రహిత పరిస్థితులు కల్పిస్తూ బాల్య వివాహాలను నిర్మూలించి చక్కని విద్యను అందించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయటమే చిన్నారి భవిత పథకం లక్ష్యమని కొమ్మూరు గ్రామ సర్పంచి కోసూరి ఏసు అన్నారు. మండల పరిధిలోని కొమ్మూరు గ్రామంలో నూజివీడు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చిన్నారి భవిత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల ఆరో తేదీ నుంచి 12వ తేదీలోపు ఆడపిల్లకు జన్మనిచ్చిన తోట నాగరాణి, పోసయ్య, పోలుబోయిన స్రవంతి, కుపాల కళావతిలను సత్కరించారు. అనంతరం వారితో తమ పిల్లల బంగారు భవిష్యత్తు ఏర్పాటుకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పరసా కోటేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.శివకుమారి, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇటుకల తయారీ కార్మికులను ఆదుకోవాలి

టి.నరసాపురం: ఇటుకలు తయారు చేసే కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎఐటియుసి చింతలపూడి ఏరియా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో ఇటుకలు తయారు చేసే కార్మికుల సమావేశం గంటా పెద్ద ఆంజనేయులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బుచ్చిబాబు మాట్లాడుతూ ఇటుకలు తయారు చేసే సామగ్రి ధరలు పెరగడం వల్ల తయారు చేసిన ఇటుకలకు గిట్టుబాటు ధర లేక ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులంతా ఐక్యంగా ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షులుగా గంటా పెద్ద ఆంజనేయులు, కార్యదర్శిగా కైతేపల్లి రమేష్, సభ్యులు మానుకొండ శ్రీనివాస్, గొలుగూరి సుధాకర్ రెడ్డి, గంగరాజు, గంగేటి వీర్రాజు, నాదెండ్ల ధర్మరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రభుత్వ భూములను సంరక్షించాలి

ముసునూరు: ప్రభుత్వ భూములను గుర్తించి ఆక్రమణలకు గురికాకుండా చూడాలని మండల రెవెన్యూ అధికారులకు జెసి లావణ్యవేణి సూచించారు. మండలంలోని వేల్పుచర్ల, చెక్కపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ భూములను శుక్రవారం ఆమె పరిశీలించి, అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు.

ఎఎస్‌పిగా భాస్కర్‌రావు నియామకం

ఏలూరు స్పోర్ట్స్: డిఎస్‌పిలను అదనపు ఎస్‌పిలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. అందులో భాగంగా ఏలూరు జిల్లా అదనపు ఎస్‌పిగా ఎజెవి.భాస్కరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన తూర్పుగోదావరి జిల్లా సిసిఎస్ డిఎస్‌పిగా పనిచేస్తున్నారు. రెండు రోజుల్లో ఆయన ఎఎస్‌పిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

విచారణ అధికారులపై ఫీల్డ్ అసిస్టెంట్ వీరంగం

జంగారెడ్డిగూడెం: మండలంలోని నాగులగూడెం ఉపాధి హామీ పనుల్లో జరిగిన మస్తర్ల మాయాజాలం, అవకతవకలపై విచారణ చేపట్టడానికి వచ్చిన అధికారులపై ఫీల్డ్ అసిస్టెంట్ దుర్భాషలాడిన ఘటన పలువురిని నివ్వెరపరిచింది. శుక్రవారం స్పందన కార్యక్రమంలో నాగులగూడెంలో ఫీల్డ్ అసిస్టెంట్లు మస్తర్లలో అవకతవకలు చేస్తున్నారని ఆ గ్రామస్తులు చేసిన ఫిర్యాదుపై ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిడి ప్రఫుల్ కుమార్, ఎపిఒ శ్రీదేవి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో గ్రామస్తులు అవినీతి, అక్రమాలను అధికారులకు వివరించారు. దీంతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ విచారణకు వచ్చిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడాడు. అతను సర్పంచి బంధువు కావడంతో కనీస మర్యాద లేకుండా మాట్లాడుతున్నాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దురుసుగా ప్రవర్తించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి తగిన చర్యలు తీసుకోవాలని, అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చిక్కిన విద్యార్థి ఆచూకీ

ఏలూరు స్పోర్ట్స్: ఇంటర్ విద్యార్థి పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ఇంటి నుండి పారిపోయిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థి చాకచక్యంగా తల్లిదండ్రులకు చిక్కాడు. ఏలూరు నగరంలో ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రం వికారాబాద్‌కు చెందిన ఎస్.ప్రసాదరెడ్డి ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో అతను మనస్థాపంతో ఇంటినుంచి బయటకు వచ్చేశాడు. ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోని ఒక సెల్‌ఫోన్ షాపులో పాడైన తన సెల్‌కు స్క్రీన్ వేయించుకున్నాడు. డబ్బులు లేకపోవటంతో తన స్నేహితుడికి కాల్ చేసి ఫోన్‌పే ద్వారా డబ్బులు వేయించాడు. ఇదే విషయాన్ని ప్రసాదరెడ్డి తల్లిదండ్రులకు చెప్పాడు. అప్రమత్తమైన తండ్రి శ్రీకాంత్‌రెడ్డి సెల్‌ఫోన్ షాపు యజమానికి ఫోన్ చేసి విషయం మొత్తం వివరించాడు. వెంటనే షాపు యజమాని 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. క్షణాల్లో ఏలూరు టూటౌన్ సిఐ చంద్రశేఖర్ ఆదేశాలతో సిబ్బంది షాపుకు చేరుకుని విద్యార్థికి కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

నేరాలు – ఘోరాలు

యువకుడు ఆత్మహత్యాయత్నం

నూజివీడు రూరల్: మద్యం తాగి వచ్చిన కుమారుడిని తల్లి మందలించిందని మనస్తాపానికి కుమారుడు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వట్టిగుడిపాడు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వట్టిగుడిపాటు గ్రామానికి చెందిన యువకుడు రామకూరి తంబి బాబు మద్యానికి బానిస అయ్యాడు. పూటుగా మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇదిచ గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు అతడిని 108 వాహనంలో నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో పాడిగేదె మృతి

పోలవరం: విద్యుదఘాతంతో పాడిగేదే మృతి చెందిన ఘటన పోలవరంలో శుక్రవారం జరిగింది. పశువైద్యాధికారి షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం పోలవరం పంచాయతీ కమ్మరగూడేనికి చెందిన యాదాల ఏసుకు చెందిన పాడిగేదె స్థానిక చెరువు సమీపంలో మేతమేస్తుండగా సర్వీస్ వైరు తెగి గేదెపై పడటంతో మృతి చెందింది.


మద్యం మత్తులో యువకుల హల్‌చల్

జంగారెడ్డిగూడెం: మద్యం మత్తులో నలుగురు యువకులు కారులో హల్‌చల్ చేస్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటన పట్టణంలోని రాజుల కాలనీలో జరిగింది. శుక్రవారం యువకులు బాలసాయి, జ్యోషి వర్ధన్, బన్ను, సురేంద్ర మద్యం సేవించి కారును ఇష్టానుసారంగా నడిపి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగి కారుపై ఒరిగిపోయింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు.

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఏలూరు

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం విద్యార్థులకు, ఉద్యోగులకు, నిరుద్యోగులకు తోడ్పాడేలా కంప్యూటర్ శిక్షణ అందించడం అభినందనీయమని లయన్స్ జిల్లా రీడింగ్ యాక్షన్ ప్రోగ్రాం ఛైర్మన్ విజిఎంవిఆర్.కృష్ణారావు అన్నారు. పవర్‌పేటలోని అన్నే భవనంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రం 21వ బ్యాచ్‌గా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం విజ్ఞాన కేంద్రం కమిటీ కార్యదర్శి గుడిపాటి నరసింహరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణారావు మాట్లాడుతూ 2019లో వందలాది మందికి నాలుగు రకాల కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. నగర పరిసర ప్రాంతాలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హేలాపురి బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ కంప్యూటర్ విజ్ఞానం ప్రతిఒక్కరికీ చాలా అవసరమన్నారు. ఆ విజ్ఞానం లేనివారు నేడు నిరక్షరాస్యులుగా పురోగమన సమాజంలో మిగిలిపోతారని, అటువంటి పరిస్థితుల్లో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం నామినల్ ఫీజుతో ఇస్తున్న శిక్షణ ఎక్కువ మంది వినియోగించుకోవాలని కోరారు. అనంతరం పదిమందికి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో తమ ట్రస్టు ద్వారా అందించిన నోట్ బుక్స్‌ను విజయ్‌కుమార్, కృష్ణారావు బుక్‌బ్యాంకు నిర్వాహకురాలు జి.శారదకు నాగేశ్వరరావు అందించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సెక్షన్ కేంద్రం కోచ్ ఎం.లక్ష్మి, శిక్షణ పొందిన వారు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న వక్తలు

గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు మండలంలోని బుసరాజుపల్లి గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ కె.రజనీభాయ్ తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో, కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కళాశాలలో ఎంపిసి 45, బైపిసి 45, హెచ్ఇసి 45, టిఎ 45 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హులైన గిరిజన విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐటిఐలో ప్రవేశాలకు..

ముదినేపల్లి : స్థానిక స్వామ్ ఐటిఐ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరం ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సుల్లో వంద సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూన్ ఆరో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మూడు ట్రేడ్‌లకు కళాశాలలో అవసరమైన సాంకేతిక సౌకర్యాలు ఉన్నాయని ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు.

ఉపాధి హామీ కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ముదినేపల్లి, పెయ్యేరు, వణుదుర్రు, దాకరం, గురజ, వడాలి తదితర గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఎండలు అధికంగా ఉండడంతో కూలీలకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

చిగురుకోటలో అన్నసమారాధన

ముదినేపల్లి : హనుమాన్ జయంతి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని మండలంలోని చిగురుకోటలో శుక్రవారం నిర్వహించిన అన్నసమారాధనను ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించారు. తొలుత ఎంఎల్ఎ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.విష్ణువర్ధన్, శ్రీవీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

10 మంది అనధికార విక్రేతలకు రూ. 50 వేలు జరిమానా

ఏలూరు టౌన్: దక్షిణ మధ్య రైల్వే కమర్షియల్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఏలూరు రైల్వే స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఆహార పదార్థాలు, అనధికార విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పది మంది అనధికార విక్రయదారులను గుర్తించి రూ.50 వేలు జరిమానా వసూలు చేశారు. అనధికారిక వ్యాపారులు, అనధికార విక్రయాలు స్టేషన్లలో ఆమోదించబడవన్నారు. ఏలూరులో తనిఖీల సందర్భంగా కేటరింగ్ స్టాల్స్, ఫుడ్ యూనిట్లను అధికారులు, టిక్కెట్ చెకింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా అన్ని స్టాల్స్, ప్రధాన యూనిట్లలో సరఫరా చేయబడిన భోజనం, స్నాక్స్ నాణ్యతను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. 10 మంది అనధికార విక్రయదారులను అధికారులు పట్టుకున్నారు. ఈ తనిఖీల్లో కమర్షియల్ మేనేజర్ చంద్రమోహన్, ఎంకెవి.జగన్, సిటిఐ, సీనియర్ డిసిఎం కార్యాలయం, నెల్లూరు, ఒంగోలు, విజయవాడకు చెందిన స్క్వాడ్ టిటిఇలు తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఆర్‌టిఎస్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు మాట్లాడుతూ ప్రయాణికులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడానికి అత్యంత చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఉత్తమ వాణిజ్యం, ఆతిథ్య పరిశ్రమ పద్ధతులను అవలంబించడం ద్వారా ప్రయాణీకులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడమే రైల్వే శాఖ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. డివిజన్‌వ్యాప్తంగా అదనపు ఛార్జీల వసూలు, అనధికారికంగా హాకింగ్‌లు, విక్రయాలు, నాసిరకం, పరిశుభ్రత లేని ఆహార పదార్థాల విక్రయాల బెడదను అరికట్టేందుకు ఏడాది పొడవునా నిరంతర తనిఖీలు చేపడతామని ఆయన చెప్పారు..

స్పందన ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి


రికార్డులు పరిశీలిస్తున్న సూర్యనారాయణరెడ్డి

ప్రజాశక్తి - టి.నరసాపురం

స్పందన ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని చింతలపూడి ఎత్తిపోతల పథకం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం నిర్వహించే స్పందన కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొనాలని ఆయన తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



జీలుగుమిల్లిలో...

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటు పడాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ధర్మారావు తెలిపారు. శుక్రవారం అటవీ శాఖ అధ్వర్యంలో జీలుగుమిల్లి పంచాయతీలోని సచివాలయం, ఆటో స్టాండ్ వద్ద పర్యావరణ రహిత జీవన శైలిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ రహిత జీవన శైలి అలవాటు చేసుకోవలంటే కాలుష్యాన్ని నివారించాలన్నారు. దీనికి ముఖ్యంగా చెట్లను ఎక్కువగా పెంచాలని కోరారు. ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిరోధించాలన్నారు. అదే విధంగా ఆరోగ్య కరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని సూచించారు. అప్పుడే పర్యావరణ రహిత జీవన శైలిని పెంపొందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చీర్రి జగదాంబ, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు అశోక్, లక్ష్మీప్రసన్న, సత్యనారయణ, ఆటో యూనియన్ సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది రాఘవులు, రెహ్మత్ పాల్గొన్నారు.

ముసునూరు : పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కోరుతూ మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామంలో 209 అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంట్లో, పరిసరాల్లో చెత్తా చెదారం పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సూచించారు.

జగనన్న ఇళ్లు నూరుశాతం పూర్తికావాలి

ప్రజాశక్తి - భీమడోలు


మాట్లాడుతున్న గంగాధర్‌రావు

జగనన్న గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి నూరుశాతం నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఆడిట్ అధికారి ఎవిఆర్.గంగాధరరావు కోరారు. స్థానిక ఎంపిపి సమావేశ మందిరంలో శుక్రవారం మండల పరిధిలో ప్రాధాన్యత అంశాలు గల 13 శాఖలకు చెందిన ప్రగతిపై సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో భీమడోలు మండలం జిల్లాలో ఐదోస్థానంలో ఉందన్నారు. కలెక్టర్ ప్రత్యేకించిన వంద రోజుల్లో గృహ నిర్మాణాల కార్యక్రమం అమలులో ఆరో స్థానంలో ఉందని తెలిపారు. దీని గడువు త్వరలో ముగియనున్న నేపథ్యంలో లబ్ధిదారులను చైతన్యపరచి నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని బాధ్యులకు ఆయన విజ్ఞప్తి చేశారు. మండలంలో 286 మంది సొంతస్థలం ఉన్నవారు ఇంటి నిర్మాణానికి ముందుకు వచ్చారన్నారు. వీరిలో 50శాతం నిర్మాణాలు పూర్తి చేసుకున్నారని తెలిపారు. కలెక్టర్ ప్రత్యేకించిన వంద రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా 329 ఇళ్లకుగాను 299 ఇళ్ల నిర్మాణాలు పునాదిస్థాయి దాటాయన్నారు. మిగిలిన 509 ఇళ్లలో 350 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. రెండు వారాలుగా ఇసుక సరఫరా లేక నిర్మాణాలు కొద్దిమేర మందగించాయని, సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. భీమడోలు హైస్కూల్లో వివిధ పాఠశాలలకు పంపిణీ చేయాల్సిన పాఠ్యపుస్తకాలను సిద్ధం చేసిన గోదామును సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి, వివిధ శాఖల సహాయ ఇంజనీర్లు సతీష్, సత్యానారాయణ, రామారావు, వైఎస్ఆర్ క్రాంతి పదం భీమడోలు ఎపిఎం సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు


వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులు

వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆశ్రం ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.దేవి సూచించారు. శిక్షణా శిబిరంలో భాగంగా శుక్రవారం ఏలూరు బాలల గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, నీతి కథలతో పాటు వేసవికాలంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, వడదెబ్బ నివారణ చర్యలు, ప్రథమ చికిత్స గురించి దేవి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సిహెచ్.జగదీష్ రైటింగ్ క్లాసు, పవన్ డ్రాయింగ్, పవిత్ర డాన్స్ క్లాసులు నిర్వహించారు. ఈ తరగతులను వినియోగించుకుని ప్రతిరోజూ జరిగే క్లాసులను నోట్స్ రూపంలో రాసుకోవాలని గ్రంథాలయ నిర్వహకురాలు ఎం.శోభ విద్యార్థులకు సూచించారు. విలువైన సమాచారాన్ని నోట్స్ రూపంలో భద్రపరుచుకోవడం ద్వారా విద్యార్థుల ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతీ అంశాన్ని పుస్తకాల్లో రాసుకోవాలని సూచించారు. అనంతరం హేలాపురి క్లబ్ వారిచే పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. వారి గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేసి వారిని స్మరించుకోవడం నేటితరం బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జి.శారద పాల్గొన్నారు.

రూ.3.50 కోట్లతో గుండుగొలను వంతెన పున:నిర్మాణం

ప్రజాశక్తి - భీమడోలు


వంతెన నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ఎంఎల్ఎ వాసుబాబు

గోదావరి కాలువపై గుండుగొలను వద్ద శిథిలావస్థకు చేరి కుప్పకూలిన వంతెన స్థానంలో రూ.3.50 కోట్ల వ్యయంతో వంతెన పున:నిర్మాణానికి జలవనరుల శాఖ అనుమతించింది. శుక్రవారం వంతెన పరిశీలనకు వచ్చిన జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ సతీష్ కుమార్ ఈ విషయాన్ని ప్రకటించారు. ఉంగుటూరు శాసనసభ్యులు వాసుబాబు కృషి ఫలితంగా వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. జిఆర్ కంపెనీ పనులు చేపడుతుందన్నారు. పనుల నిర్వహణ, ఇతర కార్యక్రమాలను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, రాజమండ్రి పథక సంచాలకులు సురేంద్రనాథ్ ఆధ్వర్యంలోని బృందం చేపడుతుందని ఆయన తెలిపారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభానికి శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు. కాలువలు వదిలే సమయానికి వంతెన కింద భాగంలో చేపట్టాల్సిన నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. సందర్భంగా ఉంగుటూరు శాసనసభ్యులు వాసుబాబు మాట్లాడుతూ ఏలూరు కాలువపై గుండుగొలను వద్ద గోదావరి కాలువపై నిర్మించిన వంతెన కూలిపోయిన నేపథ్యంలో నూతన వంతెన నిర్మాణం తప్పనిసరి అయిందన్నారు. వంతెన కూలగానే పున:నిర్మాణం కోసం సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. గతంలో గణపవరం వచ్చిన సిఎం హామీ ఇచ్చారన్నారు. వంతెన నిర్మాణం వల్ల కొల్లేరు ప్రాంతాలకు చెందిన 40 –50 వేల ప్రజానీకంతో పాటు దెందులూరు, ఏలూరు రూరల్ లో మండలాలకు చెందిన పలు గ్రామాల వారు నూతన వంతెన మీదుగా జాతీయ రహదారిని చేరుకుని తమ రాకపోకలను నిర్వహించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కనుమాల రామయ్య, ఉపసర్పంచి ముదిండి సూర్యనారాయణ రాజు, పిప్పర సుబ్బరాజు, భీమడోలు సొసైటీ అధ్యక్షులు రాయపాటి సత్య శ్రీనివాస్, డాక్టర్ పి.మాన్‌సింగ్, రామకుర్తి నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఇంజేటి నీలిమ జూనియర్ పాల్గొన్నారు.

30న చింతలపూడిలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఈ నెల 30న చింతలపూడిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ ఎలిజా తెలిపారు. స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో మెగా జాబ్ మేళా వివరాలు వెల్లడిస్తూ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఎలిజా మాట్లాడుతూ ఏడో తరగతి నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగులు జాబ్ మేళాలో పాల్గొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొమ్మిది కార్పొరేట్ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.